అని అన్నదమ్ములు పేచీలు పెట్టుకొంటారు కాని ఆస్తి మాకువద్దు అంటే మాకువద్దు అని రాముడు అన్నదమ్ములు పేచీలుపెట్టుకొన్నారు. భగవంతుడికి రెండుసార్లు నవ్వువస్తుందట. ఒకటి ఏమిటి అంటే అప్పటివరకు వీడు అన్నా అంటాడు, వాడు తమ్ముడు అంటాడు కాని ఆస్తులపంపకందగ్గర ఒక కొబ్బరిచెట్టు దగ్గర పేచీలు పెట్టుకొని సుప్రీంకోర్టువరకు వెళ్ళిపోతారు అప్పడు దేవుడు నవ్వుతాడట. రెండవది ఏమిటి అంటే ఇంక ఒక రోజుకంటే బతకడు చనిపోతాడు అని డాక్టరు చెపుతూ ఉన్నా ఇంకా నాకు పది సంత్సరాల వరకు ఏమీ ఇబ్బంది లేదు అంటాడు అప్పడుకూడా దేవుడు నవ్వుతాడు. మనుషులలో సహనం తగ్గిపోతోంది. భూమికి ఎంత సహనం ఉందో రాముడికి అంతసహనం ఉంది అని చెపుతారు. రామచంద్రమూర్తి నుండి మనం సహనం నేర్చుకోవాలి. రాముడికి రాజ్యంపోయింది, 14సం॥లు వనవాసం చెయ్యమని చెప్పారు. రాజ్యంలో అందరూ దుఃఖపడుతున్నారు. వారిని చూసి రాముడు ఏమి అన్నాడు అంటే ఇంత చిన్న విషయానికి అంత గోల ఎందుకు అన్నాడు, అది రాముడిలో ఉన్న సహనం. మనకు ఒకరూపాయి నష్టంవస్తే తట్టుకోలేము, ఎవరైనా చిన్నమాట అంటే భరించలేము, అసలుమనకు సమానబుద్ధి లేదు.

గాంధీగారు రామనామం స్మరించి తరించారు. ఆయనను తుపాకిపెట్టి కాల్చినప్పడు కూడా హేరామ్ అనిప్రాణం వదిలిపెట్టారు. గాంధీగారు జీవితం పాడుగునా సాధనచేసారు. ఆయనలో ప్రయత్నలోపం లేదు, మనలో ప్రయత్నలోపం ఉంది. ఆయన ఒంటరిగా ఉన్నా, లక్షమందిలో ఉన్నా రామనామస్మరణ విడిచిపెట్టలేదు. మనకు ఈగోడదాటితే రామనామం గొడవ ఉండదు. మనలో ప్రయత్నంలేదు, సాధనలేదు. మీరు ప్రయత్నం చేస్తే మహాత్ములు అవ్వవచ్చు, మృత్యువులేని వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవచ్చు. లక్ష్మణుడి తల్లిసుమిత్ర. రాముడు అరణ్యానికి వెళుతున్నాడు నేను వెళుతున్నాను అని లక్ష్మణుడు తల్లితో చెపితే ధశరధుడు రాముడిని వెళ్ళమన్నాడు కాని నిన్ను వెళ్ళమని చెప్పలేదు కదా అని సుమిత్ర అనలేదు. నీకు తల్లి సీతమ్మ, తండ్రి రామచంద్రుడు, వారిని తల్లిదండ్రులతో సమానంగా చూసుకో అని చెప్పింది. అయోధ్యను వదిలివెళ్ళిపోతున్నాననే తలంపు రానివ్వకు, రాముడు ఎక్కడఉంటే అదే అయోధ్య అనుకో అని సమిత్ర లక్ష్మణుడికి చెప్పింది, అది ఆవిడలో ఉన్న గొప్పతనం. లంక మహాఐశ్వర్యంలో ఉంది ఈరాక్షసులు అందరూ మనమీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరినిపాడు చేయవద్దు. అరణ్యవాసంలో రాముడు ఎత్తిన బాణం దింపకుండా ఒకచేతితో 14వేల రాక్షసులను చంపాడు, ఆరాముడు నీకు గుర్తులేదా. రాముడు చుట్టూ ఉన్నవారు కోతులు అనుకొంటున్నావు కాదు వారు దేవతలు. ఆంజనేయస్వామి వచ్చాడుకదా ఆయన బలం నువ్వు చూసావుకదా. రాముడితో యుద్ధంచేసి ఆయనను జయించలేవు. నువ్వు అనేకమంది రాక్షసులను పంపావుకదా వారి నందరిని అవలీలగా చంపాడు.





ఆయనను నీవు జయించగలవా? ఎందుకు ఈగొడవలు, లంకను అంతా పాడుచెయ్యవద్దుఅని రావణాసురుడికి భార్య హితవు చెపుతుంది. మనకు పాడైపోయే రోజులు వచ్చినప్పడు ఇతరులు చెప్పిన మంచిమాటలను మనం వినము. దేహప్రారబ్దాన్నిబట్టి ఆమాటలను మనబుద్ధి విననివ్వదు.

మనిషి ఈమట్టి మీదకు వచ్చినదిమొదలు మరల మట్టిలో కలిసిపోయే వరకు ఎవరి జీవితం సమానంగా ఉండదు. ఆదేహంయొక్క ప్రారబ్దాన్నిబట్టి ఆజీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. దేహంయొక్క ప్రారబ్దం ఖర్చుఅయ్యేవరకు ఆదేహం ఉంటుంది, ప్రారబ్దం పూర్తిఅయిన వెంటనే అది మట్టిలో కలిసిపోతుంది. ఇలా మట్టిలో కలిసిపోయే దేహానికి మనం విలువ ఇస్తున్నాముగాని జీవుడిని బాగుచేసుకోవటానికి మనం ప్రయత్నం చేయటంలేదు. జీవుడిని నిర్మలం చేసుకొంటే, స్వచ్ఛంచేసుకొంటే, శాంతం చేసుకొంటే వాడు పరమాత్మలో ఐక్యమవుతాడు. బ్రహ్మానుభవం పొందాలంటే మనం ప్రకృతిని దాటివెళ్ళాలి. ప్రకృతి అంటే జీవలక్షణాలు. మన మనస్సులో ఉన్న వికారములే స్వభావంకింద మారతాయి. డబ్బుసంపాదించటం, పదవి సంపాదించటం, గౌరవం సంపాదించటం అన్నీ తేలికే గాని మన స్వభావాన్ని మార్చుకోవటం అన్నిటికంటే కష్టం. మన స్వభావాన్ని మార్చుకోవటానికి సాధన అవసరం. మన స్వభావాన్ని బట్టే మనం మాట్లాడతాము, మనం పనిచేస్తాము. ఈ స్వభావం అనేకజన్మల నుండి వస్తోంది. ఎవడైతే వాడి స్వభావాన్ని జయించాడో వాడే మోక్షానికి అర్హుడవుతాడు. కేవలం నీ తెలివితేటల వలన, నీసాధన వలన నీ స్వభావాన్ని జయించలేవు. ఈశ్వరుని దయ ఉంటే గానీ స్వభావంలోనుండి నీవుబయటకు రాలేవు. నీస్వభావంలోనుండి నీవు బయటకు రాకపోతే నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు గోచరంకాదు. ఆవస్తువు తెలియకపోతే నీకు స్వేచ్ఛలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. స్వభావాన్ని జయించటానికి భగవాన్ రెండు మార్గాలు చెప్పారు. ఒకటి నీదేహప్రారబ్దంలో ఏదివచ్చిన దానిని ఈశ్వరప్రసాదంగా స్వీకరించు, అప్పడు నీకు సమానబుద్ధి కలుగుతుంది, నీవుయోగివి అవుతావు. అప్పడు నీవు స్వభావాన్ని జయిస్తావు, నీవు తరిస్తావు. రెండవది ఏమిటి అంటే మనం నేను అంటున్నాము కదా, ఈనేనుగా వ్యక్తమయ్యేది ఎవరు అని ఆనేనును విచారణ చేయటం వలన నీ స్వభావంలోనుండి బయటకు వస్తావు. మనకు నేను అనే తలంపు వచ్చాక నాది అనే తలంపువస్తుంది. ఈనేను, నాది ఉన్నంతకాలం సాకారాన్ని, సద్గుణాన్ని ఆరాదించమని శాస్త్రం చెపుతోంది.

ధర్మఅర్ధకామమోక్షములలో ధర్మాన్ని మొదటపెట్టారు, మోక్షాన్ని చివరపెట్టారు. నీవు ధర్మబద్ధంగా జీవిస్తూఉంటే నీకు అర్ధకామములు నెరవేరతాయి, మోక్షంకూడా వస్తుంది. మొదట పునాది ధర్మం. మనం ఎలాగ జీవిస్తే, మనజీవనవిధానం ఎలాగఉంటే మనకు

మోక్షం కలుగుతుందో అదే ధర్మం. మనస్వభావాన్ని బట్టి మాట్లాడతాము గాని భగవంతుడు చెప్పిన దానిని ప్రమాణంగా తీసుకోము. మన స్వభావాన్ని ప్రక్కనపెట్టి, భగవంతుడు చెప్పిన విధంగా మనం జీవిస్తూ ఉంటే మన స్వభావంలోనుండి బయటపడతాము, తరిస్తాము. ఈ స్వభావాన్ని నేను ఏమీకల్పించలేదు, ఈజీవకోటి అంతా ఎవడి స్వభావాన్ని బట్టి వాడు ప్రవర్తిస్తున్నాడు. మీరు ప్రయత్నంచేసి మీస్వభావంలోనుండి బయటకు రండి అని భగవంతుడు చెపుతున్నాడు. మీ హృదయంలో అంతర్యామిగా నేను ఉన్నప్పటికి మీ స్వభావంవల్ల మీకు తెలియటం లేదు. దానిని మీరే కల్పించుకొన్నారు. మీరు కల్పించుకొన్న స్వభావంలోనుండి ప్రయత్నంచేసి బయటకు వస్తే మీకు అమృతానుభవం కలుగుతుంది అని భగవంతుడు చెపుతున్నాడు. రాముడికి ఆత్మజ్ఞానం ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. దానికి భగవాన్ ఏమిచెప్పారు అంటే శ్రీరామ, శ్రీరామ అని మనం ఆయనను తలపెట్టుకొంటూ ఉంటే, ఆయనను స్మరిస్తూఉంటే మనకు జ్ఞానం కలుగుతూఉంటే ఆయన జ్ఞానం లేకుండా ఎలా ఉంటాడు అన్నారు. రామశబ్దంలో రా అన్నప్పడు మన బుద్ధిలో ఉన్నదోషాలు అన్నీ బయటకుపోతాయి, బయటకు పోయినవి మరల లోపలకు రాకుండా మ అన్నప్పడు మూతబడిపోతుంది. రామనామస్మరణవలన బుద్ధిలోఉన్న దోషాలు నశిస్తాయి. మనబుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ బయటకు పోతే మనకు ఆనందం కలుగుతుంది, శాంతి కలుగుతుంది. కాకి రెట్ట వేసింది అనుకోండి దానిని మనజేబులో వేసుకొంటామా? లేదు. అలాగే నువ్వు విడిచిపెట్టేసిన గుణాలను కాకిరెట్టతో సమానంగాచూడు. ఈగుణం ఆత్మజ్ఞానానికి పనికిరాదు అని దానిని వదిలేసినప్పడు దానిని కాకిరెట్టలాగచూడు, అలాచూస్తే ఆగుణం నిన్ను సమీపించదు.

రాముడు ఎలా జీవించాడు అంటే అంతర్యామిగా ఉన్న భగవంతుడిని ఎలా తెలుసుకోగలరో అలా జీవించి చూపించాడు. మనం ఎలా జీవిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుందో అలా జీవించి చూపించాడు, వాడు రాముడు. భగవాన్ అరుణాచలేశ్వరుడితోఏమన్నారు అంటే ఇప్పడు నేను ఏస్థితిలో ఉన్నానో అది నా తెలివివలన, నా సాధనవలన పొందలేదు, ఇది అంతానీదయ అన్నారు. నీదయే నన్ను ఈస్థితిలో కూర్చోబెట్టింది అన్నారు, అది శరణాగతిమార్గం. కోర్కెల యొక్క సమూహం, వాసనల యొక్క సమూహం, అలవాట్ల యొక్క సమూహమే స్వభావంగా ఏర్పడుతుంది. ఈ అలవాట్లు, వాసనలు అన్నీ మనస్సులో ఉన్నాయి. నీ మనస్సును ఉపసంహరించు. నువ్వు ఏమార్గంలో ప్రయాణం చేసినా ఇప్పడు ఏ మనస్సు అయితే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అందులోనుండి విడుదలపొందటమే నీ జీవితలక్ష్యం. ఎక్కడయితే భక్తిఉందో అక్కడ ఏదో రోజు జ్ఞానం కలుగుతుంది, భక్తిజ్ఞానానికి సహకరిస్తుంది. నీవు శ్రద్ధగా భగవంతుడి గురించి





శ్రవణంచేస్తూ ఉంటే, ఆయన మీద విశ్వాసం పెరుగుతూ ఉంటే నీ మనస్సుకు బయటకు వెళ్ళే అలవాటు తగ్గిపోతుంది. మనం గుడికి వెళ్ళినప్పడు భగవంతుడిని ఆత్మజ్ఞానం గురించి అడగాలి. ఒక అబ్బాయికి పెళ్ళి కుదిర్చినప్పడు వాళ్ళే కొత్త బట్టలుకుట్టిస్తారు కావలసినవి అన్నీచూస్తారు, కొత్తబట్టల గురించి అడగనక్కరలేదు. అలాగే నీవు ఆత్మజ్ఞానం అడుగుతూ ఉంటే దానితోపాటు మిగిలినవి అన్నీ ఆయనే సమకూరుస్తాడు. భక్తి అనేది ప్రేమపూరితంగా ఉండాలి, జ్ఞానపూరితంగా ఉండాలి, వివేకపూరితంగా ఉండాలి అంతేగాని భక్తి వ్యాపారంగా ఉండకూడదు.

మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతున్నాయి. ఏ సంఘటన ఎప్పడు జరుగుతుందో ఆయనకు తెలుసు. మనం ట్రైనింగ్ పొందటానికి ఈ సంఘటనలు వస్తున్నాయి. మనకంటే అతీతమైన శక్తి ఒకటి ఉంది, దాని ఆజ్ఞ ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తోంది. నీ మనస్సును తీసుకొని వెళ్ళి దానికి శరణాగతి చెయ్యాలి, దానికి వశం చెయ్యాలి. పంచవటిలో ఉండగా రాముడు లక్ష్మణుడితో ఇది సుందరమైన ప్రదేశము, ఇక్కడ కొన్నిరోజులు ఉందాము, ఒక కుటీరం నిర్మించు అని చెపుతాడు. ఎక్కడ వెయ్యమంటారో చూపించండి అని లక్ష్మణుడు అడిగితే నువ్వు ఆలోచించుకొని కుటీరం వెయ్యి అని రాముడు చెపుతాడు. అప్పడు లక్ష్మణుడు నన్ను అంత పెద్దవాడిని చెయ్యకండి, మీరు ఎక్కడ వెయ్యమంటే అక్కడ వేస్తాను. మీచేతిలో ఉన్న పనిముట్టును మాత్రమే, మీరు సంకల్పించండి నేను పనిపూర్తి చేస్తాను అని లక్ష్మణుడు అంటాడు.

ధర్మాన్ని స్థాపించటానికి ప్రతీయుగంలోను భగవంతుడు వస్తాడు. ధర్మాన్ని స్థాపించటంలో నీ సహకారం అందించటానికి యుద్ధం చెయ్యి అంతేగాని వ్యక్తిగతమైన కక్షలు, కోపాలు, అసూయలనుబట్టి యుద్ధం చేయటం కాదు అని అర్జునుడితో పరమాత్మ చెపుతాడు. నువ్వు కౌరవుల చేతిలో చనిపోతావు అనుకో నీ ధర్మాన్ని నీవు చేసావు కనుక స్వర్గానికి వెళతావు లేకపోతే నీచేతిలో కౌరవులు చనిపోతారు అనుకో నీకు రాజ్యం వస్తుంది, స్వర్గం వస్తుంది. అందుచేత మన డ్యూటీ మనం చెయ్యాలి. తరువాత ఏదో ఒకటి అవుతుంది, మనం పనిదొంగలం అవ్వకూడదు. భగవంతుడు ఏ పనిని అయితే మనకు కేటాయించాడో ఆపని రాగద్వేషములు లేకుండా చేసుకొంటూ వెళ్ళాలి. పనిమానివేస్తే సోమరితనం వస్తుందిగాని జ్ఞానంరాదు. పనిని మనం విడిచిపెట్టకూడదు, పనే మనలను విడిచిపెట్టేస్తే దానికి అభ్యంతరం లేదు. కుటుంబపరంగా నీవు చెయ్యవలసినపని ధర్మంగా చెయ్యి సమాజానికి నీవు చేయగలిగిన సహకారం అందించు. పని ఎక్కడ చేసినా నీవు చేసే పనివలన నీవు పవిత్రుడవు అవ్వాలి, పరమపవిత్రుడికిగాని ఆనందానుభవం కలుగదు. స్వార్థపరుడు తన ప్రయోజనం కోసం ఎంత కష్టపడి పనిచేసుకొంటాడో అలాగే సమాజం

కోసం నీవు అంత కష్టపడి పనిచేస్తే యోగివి అవుతావు అని శాస్త్రంలో చెప్పారు. విభీషణుడిది దీర్ఘ శరణాగతి. వారికి శరణాగతిలోనే ఆనందం. పరిపూర్ణమైన శరణాగతిలో నీకు సంకల్పం అంటూ ఏమీ ఉండదు, భగవంతుడి చేతిలో పనిముట్టుగా ఉంటాడు. ఏదైనా ఇస్తే ఆయన అనుగ్రహం, ఇవ్వకపోయిన ఆయన అనుగ్రహమే అనుకొంటాడు. శరణాగతి పొందినవాడికి మనస్సులో క్షోభ ఉండదు. వాడికి శరీరం ఉన్నాలేకపోయినా, ప్రపంచం కనిపించినా కనబడకపోయినా ఆనందమే. మన జీవితంలో ఏది ఎప్పుడు జరగాలోముందే నిర్ణయింపబడి ఉంటుంది, జరిగేది అంతా ఈశ్వరసంకల్పం, అనుకునేది మన సంకల్పం అని భగవాన్ చెపుతూ ఉంటే అక్కడ ఉన్న ఒక ఫ్లీడర్‌గారు భగవాన్ దగ్గర తిరుగుతున్న ఫేన్‌ను ఆపుచేసి ఫలానరోజున, ఫలానగంటలో, ఫలానా నిమిషంలోనేను ఈఫేన్ ఆపుచేయాలని కూడా తల్లి గర్భంలోనుండి బయటకు వచ్చినప్పడే నిర్ణయం అయిపోయిందా అని భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమీ ఆలోచించకుండానే వెంటనే సర్టెన్లీ అన్నారు. నువ్వు దేవుడి కుమారుడివేకాదు, నువ్వు దేవుడితో సమానము కూడా అని ఏసుక్రీస్తును ఒక శిష్యుడు పొగుడుతూ ఉండే అప్పడు ఏసుక్రీస్తు ఏమి అన్నాడు అంటే ఈ రోజు నన్ను దేవుడు అని స్తోత్రం చేస్తున్నావు, రేపు 30 రు॥లు లంచానికి నీవు ఏసుక్రీస్తును పట్టిఇస్తావు అదే మాయ అని చెప్పాడు.

ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు. మనకేది మంచిదో మనకంటే ఆయనకే బాగా తెలుసు అని ఆయనమీద విశ్వాసం ఉంచి, పూర్తిగా ఆయనమీద భారంవేసి జీవిస్తూ ఉంటే అహంభావన నశిస్తుంది. మనలో ఎందుకు పనికిరానిది అహంభావన. అందుచేత భగవంతుడి మీద విశ్వాసం పెంచుకో, విశ్వాసాన్ని దృఢపర్చుకో. నీ జీవితంలో ఏది వచ్చినా అది ఈశ్వరుని ప్రసాదంగా తీసుకో. నీకు హెచ్చుతగ్గులు వస్తున్నాయి అనుకో, ఈ హెచ్చు తగ్గులువచ్చే ఈ నేను ఎవరు అని ప్రశ్నించుకో, వాడేసైతాను. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా మొత్తం మీద ఈసైతానుగాడు పోవాలి. నీవు ఏమార్గంలో ప్రమాణం చేసిన అంకితభావంతో, ప్రేమగా, హృదయపూర్వకంగా నిండుమనస్సుతో, రసపూరితంగా చెయ్యాలి. ఇప్పడు మనం ఏమనుకొంటున్నాము అంటే భగవంతుడు ఉన్నాడు, మనము ఉన్నాము అనుకొంటున్నాము. మనంలేము ఉన్నవాడు భగవంతుడు ఒక్కడే అని అనుభవంలోనికి వచ్చేవరకు సాధన చెయ్యాలి. మీ ఇంట్లో ముసలివారు ఉంటే ఎప్పడు చనిపోతారు అని కనిపెట్టుకొని ఉండవద్దు ఎందుచేతనంటే వారు బతికి ఉండటం కూడా ఈశ్వరసంకల్పం. వారు చనిపోవటంకూడా ఈశ్వరసంకల్పాన్ని బట్టి జరుగుతుంది. అందుచేత బతికిఉన్నవారి గురించివారు ఎప్పడు చనిపోతారు అని ఎదురుచూడవద్దు. చనిపోయిన వారి గురించి దుఃఖపడవద్దు. ఈ రెండూ నేర్చుకొంటే మీకు ఈశ్వరసంకల్పం మీద గౌరవం ఉన్నట్లు గుర్తు. చనిపోయినవారి గురించి చావటానికి సిద్దంగా ఉన్నవారు ఏడుస్తున్నారు అనేవారు భగవాన్. ఆఏడ్చేవాడు ఎవడు అని ప్రశ్నించుకొని, వాడిని తొలగించుకొంటే వాడికి మోక్షం వస్తుంది, వాడికి పునర్జన్మలేదు. ఎందుకు పునర్జన్మలేదు అంటే ఏడ్చేవాడులేడు కాబట్టి వాడికి పునర్జన్మలేదు, ఏడుపు మిగిలిఉంటే మనం పునర్జన్మలు కోరుకొంటాము. మీ అమ్మగారు ఏడుస్తున్నారు అని ఎవరైనా భగవాన్‌తో అంటే ఏడవటం మంచిదే, ఆ ఏడుపు అంతా ఖర్చు అయిపోవాలి, ఏడుపు మిగిలిఉంటే మరల జన్మ వచ్చేస్తుంది అని చెప్పారు.

శబరి మాతంగమహర్షికి ఎంతో సేవచేసింది. మహర్షి చనిపోయే సమయంలో శబరితో చెపుతాడు. నువ్వునాకు సేవ చేసావు, దానికి ఫలితం భగవంతుడు ఇస్తాడు. నువ్వు కంగారుపడవద్దు, రాముడు వస్తాడు, ఎప్పడైతే ఆయన దర్శనం అయ్యిందో అప్పడు నీకు మోక్షం వస్తుంది అని చెపుతాడు. అలాగే రాముడు శబరి దగ్గరకు వచ్చాడు. శబరి రాముడికి సేవ చెయ్యలేదు కాని మాతంగమహర్షికి చేసిన సేవలు పరమాత్మను అక్కడకు తీసుకొని వచ్చాయి. అది అక్కడ అంతరార్థం. రామరావణ యుద్ధం జరుగుతున్నప్పడు రావణుడికి రథం పోయింది, గుర్రాలు పోయినాయి ఒక్కడే నిలబడి ఉన్నాడు అప్పడు రాముడు అంటాడు రావణా నీవు ఇంటికి వెళ్ళిపో. రేపు మరల కొత్త రథం తోటి, ఆయుధాలతోటి రా అని చెపుతాడు అందుచేత ఆయనను మర్యాద పురుషోత్తముడు అంటారు. కర్ణుడికి అర్జునుడికి యుద్ధం జరిగేటప్పడు కర్ణుడురథం భూమిలో కూరుకొనిపోయింది. కర్ణుడు కిందకిదిగి చక్రంపైకి ఎత్తుతూ ఉంటాడు. అప్పడు కృష్ణుడు అర్జునుడితో బాణం వేసెయ్యి అంటాడు. ఆ మాటలు విని కర్ణుడు కృష్ణుడితో నీవు చెప్పే మాటలు ధర్మంగాలేవు, ఇలా బోధిస్తున్నావు ఏమిటి అంటాడు. ధర్మాన్ని ఎవరైతే రక్షిస్తున్నారో వాడినే ధర్మం రక్షిస్తుంది అని కృష్ణుడు చెపుతాడు. నీకు ధర్మం మీద గౌరవంలేదు. పాండవులను అన్యాయంగా చంపటానికి నీవు చేసిన పనులు ఏమిటి? నువ్వు ద్రౌపతికి చేసిన అవమానం మాట ఏమిటి? దుర్యోధనుడికి ఎన్ని చెడ్డసలహాలు చెప్పావు ఇప్పడు నీవు ధర్మం గురించి మాట్లాడుతున్నావు. ధర్మంయందు గౌరవంలేనివాడిని ధర్మం రక్షించదు అని పరమాత్మ చెపుతాడు. పెద్దలు ఏమి చెపుతారు అంటే రాముడు చేసినట్లు చెయ్యండి కాని కృష్ణుడు చేసినట్లు చెయ్యకండి, కృష్ణుడు చెప్పినట్లు చెయ్యండి అని చెపుతూ ఉంటారు.

## గమనిక

సద్గురు శ్రీ నాన్నగారు ఈ సంవత్సరం అమెరికా పర్యటన విరమించుకున్నారు. ది॥ 2-7-04 శుక్రవారం గురుపౌర్ణమి మహోత్సవము జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో జరుపబడును

## గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమములు

**సద్గురు దర్శనం**

ఉ॥గం॥ 6-00ల నుండి మ॥గం॥ 12-00 వరకు

**శ్రీరమణ క్షేత్రంలో భగవాన్ పూజ**

ఉ॥గం॥ 8-00ల నుండి

**సద్గురు శ్రీ నాన్నగారు శ్రీరమణ క్షేత్రంకు విచ్చేయుదురు**

మ॥గం॥ 12-00లకు

**హైదారాబాదు వా॥లు శ్రీ రామకృష్ణంరాజు, లక్ష్మీ దంపతులచే**

**గురుపూజ**

మ॥గం॥ 2-00లకు

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

మ॥గం॥ 2-30 ని॥లకు

**దూర ప్రాంత భక్తులకు ఉదయం గం॥ 10-00లనుండి మధ్యాహ్నం గం॥ 12-00ల వరకు ప్రసాద వినియోగం**





ది॥ 15-6-04న పాలకొల్లులోని ఈశ్వర సాయి సూపర్ స్పెషాలిటి డెంటల్ క్లినిక్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా డా॥ ఆర్. సాయిఈశ్వరవర్మ, డా॥ ఆర్. ఉషారాణి దంపతులతో సద్గురు శ్రీ నాన్నగారు.



ది॥ 12-6-04న పాలకొల్లులో వైష్ణవీ వెంచర్స్ సంస్థను సద్గురు శ్రీ నాన్నగారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించినారు. కొనుగోలు దారే దేముడుగా భావించి, దుకాణదారు అతనికి తృప్తి కలిగించే ప్రయత్నం చేస్తే వ్యాపారాభివృద్ధికి ఇదే సుగమ మార్గం అవుతుందని శ్రీ నాన్నగారు చెప్పారు.